# జీవితం పూలపాన్పు కాదు

అడిగోపుల వెంకట రత్నమ్

—:o:—

ప్రఖ్యాత రచయిత్రి శశిరేఖపేరు వినని వారుండరు. ఉంటారు. బహు కొద్దిమంది. ఆమె నవలలు, కథలు, కథానికలు ప్రచురించని పత్రికలు లేవు ఉంటాయి. ఎక్కడో కుక్కగొడుగుల్లాంటివి. అసలామె అలాంటి పత్రికలకు రచనల్ని యివ్వదు కూడ. ఆమె రచనల్ని చదవనివారుండరు ఎందుకుండరు? అంతటి శ్రీశ్రీని అందరూ చదివారా యేం? యువతరం ఆమె రచనల కోసం ఎగబడి పోతూంది.

గత ఏడెనిమిదేళ్ళనుంచీ ఆమె రాస్తూంది. పత్రికాధిపతులు ఆమెకు టెలిఫోన్లు చేసి మరీ వచ్చి క్యూలో నిలబడుతున్నారు. ఈ సారి మా పత్రిక జన్మదిన సంచికకు మీ కథ యివ్వాలి రేపు ఉగాది నవలల పోటీలో మీ నవలకు మొదటి బహుమతి యివ్వాలను కొంటున్నాం కాబట్టి తప్పకుండా నవల పంపండి. ఇప్పుడిప్పుడే నిల దొక్కుకుంటున్న మా పత్రికలో మీ సీరియల్ లేకపోతే, నిలబడేటట్లు లేదు. అంటూ ఆమె వెంట బడుతున్నారు.

మరీ మొహమాట మున్నవార్ని సంతృప్తి పరచి మిగిలిన వాళ్ళకు త్వరలో యిస్తానని వాగ్దానం చేస్తూంది. వాళ్ళేమో త్వరలోనే ప్రముఖ రచయిత్రి శశిరేఖగారి నవల ప్రచురించ బోతున్నామంటూ ప్రకటనలు చేస్తున్నారు త్వరలో అనేదానికి కాలమానం లేదు కాబట్టి వోపిక నడలని పాఠకులు దాన్ని సంవత్సరానికి వేసినా సంతోష పడుతున్నారు.

ఎక్స్‌కర్షన్‌కు వచ్చిన విద్యార్థుల ప్రోగ్రామ్‌లో ఆ పట్టణంలో చూడాల్సిన ముఖ్యస్థలాల్తో పాటు, శశిరేఖను కల్సుకోవడంకూడ మిళితమై వుంటుంది.

ఆవాళ ఉదయం శశిరేఖకు ఏమీ ఎంగేజిమెంట్లు లేవు. వాకిట్లో నిలబడి వుంది. ఇంట్లో రేడియో తక్కువ స్థాయిలో మోగుతూంది. వాకిట్లో కుక్క ఎక్కువ స్థాయిలో అరుస్తూంది.

ఒక స్త్రీ వచ్చి ఎదురుగా నిలబడింది.

"ఏం కావాలండీ?" శశిరేఖ అడిగింది.

"శశిరేఖగారితో మాట్లాడానికివచ్చానండీ" అందామె.

"లోపలకు రండి. నేనే శశిరేఖను...." అని ఆమెను లోనికి తీసుకెళ్ళింది. ఇద్దరూ డ్రాయింగ్ రూంలో కూర్చున్నారు.

"నేను తిరుపతి వెళ్తూ దార్లో మిమ్మల్ని కలుసుకోడానికి యీ రోజు ప్రయాణం బ్రేక్ చేసుకొని వచ్చానండీ" అందామె.

జవాబుగా శశిరేఖ అందంగా నవ్వింది. మరింత అందంగా దగ్గింది కూడ.

"మీ కథల్ని నేను చాలా చదివాను రచనల్ని బట్టి మీకు వివాహం కాలేదని వూహించాను. నా వూహ నిజమనుకొంటాను."

"అవునండీ! ఈ సాహిత్యంలో పడ్డాక వివాహాన్ని గురించి ఆలోచించడానికే టైము లేదంటే నమ్మండి" చిరునవ్వు నవ్వింది.

"చాల కాలంనుండి మీతో మాట్లాడాలనుకొంటున్నాను. మీరు కోపగించుకోనంటే నేనొకటి చెప్పదల్చుకొన్నాను మీ రచనలు

ఎక్కువ కాలం నిలబడవు."

"ఎందువల్ల ?"

"కత్తి దిగబడితే గుర్తుంటుంది గాని కాల్లో ముల్లు దిగబడితే గుర్తుంటుందా ?"

శశిరేఖకు యీ విమర్శ కొద్దిగా బాధ మరి కొంత ఆశ్చర్యం కలిగించాయి.

"ఐతే నా రచనల్ని ఎందుకు అభిమానిస్తున్నారు ?"

"మీరు జీవితాన్ని నగ్నంగా చూడ్డం లేదు గనక, ఎంతసేపూ దానికి అందమైన పట్టుబట్టలు కట్టి, "గాలిమేడల్లో" అందంగా తిప్పుతున్నారు. అందుకే మీ రచనల్ని యువతరం విపరీతంగా ఆకర్షిస్తూంది. మీరు కాలక్షేపం కోసం రాస్తున్నారు వాళ్ళేమో కాలం గడవడానికి చదువుతున్నారు."

"నారచనలు ప్రజల హృదయాల్లో చాలా కాలం వుంటాయని నేను గట్టిగా చెప్పగలను"

"నెవర్ .... మీరు రాస్తున్నట్లు జీవితం సుందరమైంది .... సుఖమైంది కాదు. వడ్డించిన విస్తరి అంతకంటే కాదు. అదొక ముళ్ళకంప. యుక్తవయస్సులో వున్నవాళ్లు ... అందులో అడుగు పెడ్తున్నవాళ్ళు జీవితాన్ని గూర్చి అందంగా కలలు గంటూంటారు. ఆ కలలకు మీ రచనలు రంగులు పూస్తున్నాయి. వాటిని చూస్తూ యువతరం మైకంలో ముందుకెళ్ళిపోతూంది. అందువల్ల జీవితాలు దెబ్బతినే అవకాశం వుంది. ఆనాటి మొల్ల రామాయణం యీనాటి మహాప్రస్థానం కలకాలం నిలబడతాయి. అంతే గాని...." ఆవేశంలో మాట్లాడలేకపోయింది.

"జీవితం గులాబీ తోటలాంటిది ఆత్రంగా గులాబీలకోసం చెయ్యి జాపితే మన కెదురయ్యేవి ముళ్ళు. అలాగే జీవితాన్ని వొక్కసారి రుచి చూడాలనుకొంటే, మీ లాంటి నిరాశావాదు లెదురౌతారు.

సంభాషణ హద్దులు దాటుతూంది.

"అదే మీ రచనల్లో వున్న మత్తు ఆ మత్తులో యువతరం యాత్ర గొడ్తూంది మీకిప్పుడు ఏం జెప్పినా వినే స్థితిలో లేరు. వస్తాను !" అని గబగబ వెళ్ళిపోయిందామె.

శశిరేఖకు ఆ మాటలు మళ్ళీ మళ్ళీ ప్రతిధ్వనించాయి. ఆమె ప్రతిరూపం మనస్సులో చెరగని ముద్ర వేసింది. కొద్దిసేపు ఆలోచించింది మళ్ళీ మామూలు తన రచనలు... పత్రికాధిపతులు.... టెలిఫోన్లు ..వుత్తరాలు..

పదేళ్ళు గడిచాయి

ఏడెనిమిదేళ్ళ నుంచి శశిరేఖ రచనలు చేయడం మానేసింది. పాఠకులెప్పుడో ఆమెను మరచిపొయ్యారు.

ఇప్పుడు ప్రముఖ రచయిత్రి క్రిష్ణవేణి రచనల కోసం యువతరం గంగ వెర్రిలెత్తుతూంది. ఆమె ఐదారేళ్ళ నుంచి రచనలు చేస్తూవుంది. తన వెనుక పాఠకులు ఆకలిదప్పులు మాని పరుగెత్తుతున్నారు ఆమె రాస్తున్న సీరియల్స్ పత్రికలకోసం రైల్వే ప్లాట్‌ఫారాలమీద, బస్టాండుల్లో పడిగాపులు కాస్తున్నారు. కృష్ణవేణికి పత్రికాధిపతులు ముందుగా అడ్వాన్సులు యిస్తున్నారు, ఈ మధ్య ఆమె వ్రాసిన రెండుకథలు సినిమాలు తీస్తే పెద్ద హిట్టయి కూర్చున్నాయి. ఇక నిర్మాతలు - దర్శకులు యింటికి ఫోన్లు చేస్తున్నారు ఇంటి చుట్టూ కార్లు పెడుతున్నారు.

ఆమెకు పెళ్ళయిందని, కాలేదని.... భర్తకు ఏరోప్లేన్లలో వుద్యోగమని....ఆమె వ్రాసిన కథలో తనే హీరోయిన్‌గా నటించబోతున్నదని....అదనీ.... యిదనీ...ఆమెను గూర్చి పాఠకుల వూహాగానాలు.

(మిగతా 49 వ పేజిలో)

# జీవితం పూలపాన్పు కాదు

(16 వ పేజీ తరువాయి)

ఒకరోజు ఓ స్త్రీ క్రిష్ణవేణి కోసం యింట్లోకి పోబోయి ఎదురుగా వరండాలో తగిలించి వున్న లైఫ్ సైజ్ ఫోటోనుచూసి టక్కున ఆగింది. ఎక్కడో చూసినట్టు గుర్తు ఆలోచిస్తే జ్ఞాపకం వచ్చింది. మళ్ళీ ఫోటోను చూసి లోనికెళ్ళింది. అంతవరకు ఫోన్లో మాట్లాడి రిసీవరు పెట్టేస్తున్న క్రిష్ణవేణి ఎదురుగా నిలబడి వున్న ఆ స్త్రీని చూసి కూర్చోండి" అంది

ఆమె కూర్చొని "మీకు చాలసార్లు వుత్తరం రాయాలనుకొన్నాను. కుటుంబ పరిస్థితులవల్ల అలాగే కాలంగడిచిపోయింది. ఈ వూళ్ళో మా బంధువుల యింటికి యీ రోజు రావడంవల్ల మిమ్మల్ని కలుసుకొనే అవకాశం కలిగింది. మీ రచనల్ని చాలవరకు చదివాను" అంది

"థాంక్సండీ! కాఫీ.... టీ ... బోర్నవిటా ఏది తీసుకొంటారు?"

"ఏదీ వద్దండీ, ఇప్పుడే కాఫీ తాగొచ్చాను"

"చెప్పండి!"

"నే నిప్పుడు వస్తూ చూశాను. వాకిట్లో వున్న ఫోటో ఎవరిదండీ?"

"మా అమ్మగారిదండి!"

"ఇప్పుడెక్కడున్నారు?"

"తొమ్మిదేళ్ళక్రిందట రైలాక్సిడెంటులో చనిపోయింది."

ఇద్దరూ రెండు క్షణాలు మౌనం వహించారు

"మిమ్మల్ని విమర్శిస్తున్నా ననుకోకండి. మీరు జీవితాన్ని గురించి అంత అందంగా... కలలుగంటూ రాయడం, యువతరం చదవడంవల్ల భవిష్యత్తును సుందరంగా వూహించుకొని పాడైపోవడానికి ఆస్కారముంది."

"అవును అవి హరివిల్లులాంటివి కాబట్టి" రచయిత్రే తన రచనల్ని గురించి అలా మాట్లాడినందుకు ఆమె ఒక్కక్షణం నివ్వెరపోయింది.

"కొంతకాలంనుండి నామనస్సులోని యీ మోయలేనిబాధను ఎవరైనా ఆప్తులకు చెప్పుకొని బరువు తీర్చుకోవాలని ఎదురు చూస్తున్నాను. నిర్మొహమాటంగా సహేతుకంగా మాట్లాడుతున్న మిమ్మల్ని చూస్తుంటే నాకెంతో ఆత్మీయుల్లా కనిపిస్తున్నారు. అసలు సంగతి చెప్తాను వినండి"

"ప్రముఖ రచయిత్రి శశిరేఖగారి పేరు మీరు వినే వుంటారు. ఆమె రచనల్ని విపరీతంగా అభిమానిస్తూ, వాటిల్లో మునిగి తేలుతుండేదాన్ని. మాఅమ్మ గట్టిగా మందలిస్తుండేది. నేను చదవడం మాన్లేదు. అలాంటి కథలు వ్రాయాలని, పాఠకుల మెప్పు పొందాలని తీవ్రప్రయత్నం చేశాను. శశిరేఖగారి రచనలు సక్సెస్ అయ్యాయి. అతి త్వరలో నే నూహించనంత పేరొచ్చింది.

"నేను వ్రాస్తున్నట్లు జీవితం పూలపాన్పు కాదని తెలుసు. మా జీవితం తీసుకోండి! ఎంత హృదయ విదారకమైనదో గమనించండి. నేను గర్భంలో వుండగానే మానాన్న ఎటో వెళ్ళిపోయాడు. ఇప్పటి వరకు జాడ లేదు. అష్టకష్టాలు పడి మా అమ్మ నన్ను పెంచింది. భయంకర పరిస్థితుల్లో ఆమెను పోగొట్టుకొన్నాను. అప్పటి నుండి మా పినతండ్రి దగ్గరే వుంటున్నాను.

"ఇలాంటి రచనల్ని మానుకోవాలని

ప్రయత్నం చేశాను. కాని అప్పటికే నాకు పెద్ద పేరు వచ్చి వుండటం వల్ల పాఠకులు .... పత్రికాధిపతులు నన్ను వూపిరి తిప్పుకోనీలేదు. ఈ బంగారు పంజరంలో నుంచి బయటపడలేక పొయ్యాను. నిర్ణయం మార్చుకుని మళ్ళీ వ్రాయసాగాను. బాగా డబ్బు వస్తూంది ఇదో వ్యాపారంగా స్వీకరించాను. నేనిలా తయారుగావడానికి ఆ శశిరేఖగారి రచనలే ! ఇంత వయసొచ్చినా నేనింకా వివాహం చేసుకోంపోవడానికి కారణం కూడా యీరచనలే !" అని చెప్పింది కృష్ణవేణి.

"మీరా శశిరేఖగార్ని చూశారా ?"

"లేదండి ! ఒకటిరెండుసార్లు ప్రయత్నం చేశాను గాని లాభం లేకపోయింది."


"నా జీవితాన్ని వుదహరించి మీ రచనల్ని విమర్శించాలనుకొన్నాను. కాని నేను చెప్పాలనుకొన్నవి మీరే చెప్పారు. నా చరిత్ర కూడ వినండి !

నేను రంగులకలలు కన్నాను. ఇతర్లచేత కవిపించాను రచనలో పడి పెళ్ళి ఆలస్యం చేసి, యిలా దిగజారిపోయాను. ఇప్పుడు నాకు పూటకి తిండిలేదు.

దాదాపు పది సంవత్సరాల క్రిందట ఒక స్త్రీ నా దగ్గర కొచ్చి యిలాంటి రచనలు చెయ్యొద్దని హెచ్చరిక చేసింది. దాని తేలిగ్గా భావించాను. కాని ఆనాటినుండి ఆమె ఎవరో కాదు .... మీ అమ్మ ! యిప్పుడు నాకిచ్చో ఫోటో చూశాక గుర్తుపట్టగలిగాను. ఇంతకీ నే నెవరో కాదు .... ఆ నాటి మీ అభిమాన ప్రముఖ రచయిత్రి శశిరేఖను !"

★

# ఆరోగ్య నిధి



డా॥ ఎన్. ఆంజనేయులు

## 24. మొటిమలు

యుక్తవయసుతోబాటు మొటిమలు రావటమనేది చాలా సహజం. ముఖం మొటిమలతో నిండితే గోళ్ళతో గిల్లటం కూడా అంతే సహజం. మొటిమలు గిల్లటం మానవ నైజమని చెప్పచ్చు. కాని ఆలోచిస్తే యిలా మొటిమలను గిల్లటం ఆరోగ్యరీత్యాను సుఖసౌందర్యపరంగానూ మంచిది కాదు. అలా గిల్లిన మొటిమలు మచ్చలను మిగుల్చుతాయి. ఆ మచ్చల వల్లనే ముఖం అంద వికారంగా తయారవుతుంది. ఒక్కోసారి సెప్టిక్ అయి ప్రాణానికే ముప్పు వాటిల్లవచ్చు ఈ మాటంటే పాఠకులు నవ్వుతారేమో గాని అలా జరిగిన సంఘటనలు చాలా వున్నాయి. మొటిమల జోలికి పోకుండా వుంటే వాటంతటవే తగ్గిపోతాయి. లేదా డాక్టర్ని సంప్రదించండి. పేపర్లో ప్రకటనలుచేసే మందులు వాడితే చర్మం చెడిపోతుంది. స్వంత వైద్యం చేసుకోవటం నిప్పుతో చెలగాటమాడటమే అవుతుంది. అస్సలు వయసువచ్చే కొలదీ మొటిమలు వాటంతటవే సమసిపోతాయి-ఏ మందులూ వాడకపోయినా. మొటిమలను గురించి ఆలోచించటం మానుకుని .. అవి మానవ సహజమని సమాధానపడితే ఏ చిక్కూ లేదు.